బాలవికాస నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో ఆదివారం నూతన బాల వికాస కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కృష్ణాజివాడి బాలవికాస అధ్యక్షులుగా ఏనుగు నరసింహారెడ్డి, కార్యదర్శిగా రాంబాయి రాజు, కోశాధికారిగా మీది బాయ్ గోపాల్‌రెడ్డి, డైరెక్టర్‌గా కుమ్మరి జగన్, చాకలి సాయిలు, సార్గు నరహరి, బద్దం పెద్ద లక్ష్మారెడ్డి, కళ్ళ చిన్న రాజురెడ్డి, లస్కర్ నరసింహులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రాంబాయి రాజు, కోశాధికారిగా మీదిబాయ్ గోపాలరెడ్డి, డైరెక్టర్లుగా కుమారి జగన్ చాకలి సాయిలు, సర్గు నరహరి, బద్దం పెద్ద లక్ష్మరెడ్డి, కళ్ల చిన్న రాజిరెడ్డి, లాస్కరి నర్సింలు కార్యకవర్గాన్ని ఎన్నుకున్నారు.

నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి 1

సోమవారం 12 జూన్ 2023

సాటాపూర్‌లో పెద్దమ్మ తల్లి బోనాల పండుగ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామంలో ఆదివారం పెద్దమ్మ తల్లి బోనాల పండుగను ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వికార్ పాషా, ముదిరాజ్ సంఘం నాయకులు కంఠం గంగారం, గ్రామ అధ్యక్షుడు పిట్ల భూమేష్, బుడ్డోళ్ల సాయి, కొల్ల శ్రీకాంత్, మీసాల నారాయణ, పిట్ల మధు, సాలూర సాయిలు, ముదిరాజ్ సంఘం స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



బోనాల పండుగలో పాల్గొన్న గ్రామస్తులు

ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

- ఇండ్లు నిర్మించుకునేందుకు రుణాలూ మంజూరు చేయాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు జె.వెంకటేష్, ఎస్వీ రమ
- 22వ రోజుకు భూపోరాటం

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలకు ఇండ్ల స్థలాలను ఇవ్వాలని, అలాగే ఇండ్లు నిర్మించుకోవడానికి రూ.10 లక్షల ఉచిత రుణాలను ఇవ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు జె.వెంకటేష్, ఎస్వీ రమ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) నిజామాబాద్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభమైన భూ పోరాటం ఆదివారం నాటికి 22వ రోజుకు చేరుకుంది. రెక్కాడితే గానీ డొక్కాడని ప్రజలు నిలువ నీడ కోసం ఉపాధి పనులు మాని 22 రోజులుగా గుడిసెలు వేసుకొని రాత్రింబవళ్లు సీపీఐ(ఎం) ఇచ్చిన స్ఫూర్తితో గుడిసె స్థలాల్లోనే గడుపుతున్నారు. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి పెద్ది సూరి అధ్యక్షతన భూ పోరాట స్థలంలో ప్రజలతో సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు హాజరైన రాష్ట్ర కమిటీ సభ్యులు జె.వెంకటేష్, ఎస్వీ రమ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జరుగుతున్న భూ పోరాటాలపై ఉద్యమించాల్సిన విధానం, పోరాటాల ఫలితాల గురించి ప్రజల్లో ఉత్సాహం కలిగించే విధంగా అనేక విషయాలు వివరించారు.

రాబోయే ఎన్నికల్లో ప్రజల హృదయాలను గెలుచుకోవాలంటే ముందు ప్రజా సమస్యలను పట్టించుకోవాలని, ప్రాథమిక హక్కుల్లో ముఖ్యమైన భూమి హక్కును అందరికీ కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు, పార్టీ సెక్రటేరియట్ సభ్యులు మల్యాల గోవర్ధన్, పార్టీ నగర కమిటీ సభ్యులు కృష్ణ, అనసూయ, మహేష్ పాల్గొన్నారు.



భూపోరాటం వద్ద మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ సభ్యులు జె.వెంకటేష్, ఎస్వీ రమ

ఇక బడికి పోదాం

- నేటి నుంచి పాఠశాలలు పున: ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యార్థులు బడికి వెళ్లాల్సిన సమయం ఆసన్నమైంది. గత నెల ఏప్రిల్ 24 నుంచి పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా 2023-24 విద్యాసంవత్సరానికి గానూ నేటి (సోమవారం) నుంచి పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు బడికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులు వేసవి సెలవులను ముగించుకొని పాఠశాల బాట పట్టవలసిన సమయం ఆసన్నమైంది. నిజామాబాద్ జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కలిపి మొత్తం 1756 ఉన్నాయి. అందులో 468 ప్రయివేట్ పాఠశాలలు, 5 సీబీఎస్ఈ సెలెబెస్ పాఠశాలలు, ఒక మూగ చెవిటి పాఠశాల, 39 ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. మిగతా ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్‌లు కలుపుకొని 1223 ఉన్నాయి. కాగా గత సంవత్సరం జిల్లా మొత్తం కలిపి ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు 2,87,820 మంది విద్యార్థులు విద్యనభ్యసించగా.. అందులో 21,643 మంది విద్యార్థులు పదో తరగతి పూర్తి చేసుకున్నారు.



ఫైల్

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో విద్యనందిస్తున్నారు. దానితోపాటు ప్రభుత్వం (కేజీబీవీ) కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్లో, (ఎస్ డబ్ల్యూఆర్‌ఈఐ) సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్, (టీడబ్ల్యూఆర్‌ఈఐ) ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్, (ఈఎంఆర్ఎస్) ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, (ఎండబ్ల్యూఆర్‌ఈఐ) మైనార్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్, గురుకులం వంటి పాఠశాలలో విద్యార్థులకు విద్య నేర్పడంతో పాటు అక్కడే భోజనం వసతి సౌకర్యాలతో ఏర్పాటు చేసినటువంటి రెసిడెన్షియల్ పాఠశాలలకూ విద్యార్థులు నేటి నుంచి తరగతులకు హాజరు కానున్నారు. అదేవిధంగా జిల్లాలో కేంద్రీయ విద్యాలయ, సీబీఎస్ఈ సిలబస్ తో జిల్లాలో 5 విద్యా సంస్థలున్నాయి. ఆ పాఠశాలలు కూడా నేటితో పున:ప్రారంభం కానున్నాయి.

పోరాడితేనే పేదలకు భూములు

- సీపీఐ(ఎం) నాయకులు కమ్మరి సాయిలు



సీపీఐ(ఎం) జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-గాంధారి

పోరాడితేనే పేదలకు భూములు వస్తాయని సీపీఐ(ఎం) నాయకులు కమ్మరి సాయిలు అన్నారు. ఆదివారం మండలంలోని మతుసంగెం శివారులో సీపీఐ(ఎం) జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిది నెలల నుంచి మతుసంగెం శివారులో గల 119 సర్వేనెంబర్‌లో దళితులు, గిరిజనులంతా కలిసి ప్రభుత్వ భూమిని వ్యవసాయం చేసుకోవడం కోసం చదును చేశారని, ఈ మధ్యకాలంలో కొంతమంది భూస్వాములు ఆ భూములో బోర్లు వేస్తున్నారని అన్నారు. దళితుల, గిరిజనుల భూములకు దొరలు అడ్డుకోవడం దొంగతనంతో బోర్లు వేసుకోవడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. ఆ భూముల జోలికొస్తే సీపీఐ(ఎం) చూస్తూ ఊరుకోదని దళితుల పక్షాన నిలబడుతుందని అన్నారు. ఈ సందర్భంగా పేద ప్రజలంతా కలిసి ఎర్ర జెండాలు పాతి 'సీపీఐ(ఎం) జిందాబాద్' అంటూ నినదించారు. కార్యక్రమంలో నాయకులు రాములు, ఏమిసింగ్, సాయిలు రైతులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సహాయం



ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాస్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర ఇబ్బందులకు గురవుతూ ఉండటానికి ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న అతి నిరుపేదలకు పీసీసీ డెలిగేట్ ఎలమంచిలి శ్రీనివాస్ రూ.పదివేల ఆర్థికసాయం చేశారు. బాన్సువాడ నియోజకవర్గం బీర్కూర్ మండలం బరంగెడ్గి గ్రామానికి చెందిన గైని గంగారాంకు ఉండటానికి ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. అలాగే ఆర్థిక ఇబ్బందులు తీవ్రంగా ఉండడం, ఆరోగ్యం సహకరించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా డీసీసీ డెలిగేట్ ఎలమంచిలి శ్రీనివాస్ స్పందించి బాధితులకు పదివేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఎలమంచిలి శ్రీనివాస్ మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గంలో అతి నిరుపేదలు సంక్షేమ పథకాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని అర్హులైన పేదలకు పక్కా ఇండ్లు నిర్మిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి ఇక్బాల్, సీనియర్ నాయకులు చందా దత్తు, సుధులం మాజీ సర్పంచ్ పీర్యానాయక్, మొయినుద్దీన్, హన్మంత్‌రావు, బేల్కొని గంగారాం, హనుమగొండ, అమృత్, లక్కులపల్లి శ్రీను, కుర్ల రవి, నాగుగొండ, పీరుగొండ, మేదరి హన్మండ్లు, లింగప్ప, వడ్ల యాదరావు, కె.యాదరావు, రాములు, గంగాధర్, ఇస్మాయిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలో యువత పాల్గొనాలి

నవతెలంగాణ-వర్ని

యువతలోని నైపుణ్యాన్ని వెలికితీయడానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ నిర్వహించనున్నట్టు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని కూనీపూర్, జలాల్‌పూర్, సైద్‌పూర్ తదితర గ్రామాల్లో క్విజ్ పోటీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ ప్రశాంతం

- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసు శాఖ
- కేంద్రాల వద్ద 144 సెక్షన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కంఠేశ్వర్



నిజామాబాద్‌సిటీ : పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్



అభ్యర్థులను పరిశీలిస్తున్న సిబ్బంది

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్పీఎస్సీ) ద్వారా ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షా ప్రశాంతంగా జరిగింది. పరీక్షా కేంద్రాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తనిఖీ చేశారు. ఆదర్శ హిందీ విద్యాలయ (హరిచరణ్ మార్వాడి) కళాశాలతో పాటు పద్మనగర్ లోని విశ్వశాంతి జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. అభ్యర్థుల హాజరు, సిబ్బంది హాజరు గురించి ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్నపత్రాలను తెరిచారా? లేదా? అన్నది నిర్ధారణ చేసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లోని గదులను సందర్శిస్తూ, అభ్యర్థులకు అందుబాటులో ఉంచిన సదుపాయాలను గమనించి ముఖ్య పర్యవేక్షకులకు పలు సూచనలు చేశారు. గత అక్టోబర్ 16 నిర్వహించిన పరీక్షలు రద్దయినందున ఆదివారం మళ్లీ గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో 62 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని, ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 12,861 మంది అభ్యర్థులకు గాను 7957 మంది హాజరయ్యారని, 4904 మంది గైర్హాజరయ్యారని వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద రిస్ట్ వాచ్లు, సెల్ ఫోన్లు, రంగు కళ్ళజోళ్ళు, ఇతరత్రా ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను తీసుకెళ్లకుండా పరీక్షకు వెళ్లే ముందే పరీక్ష కేంద్రాల వద్ద తనిఖీలను నిర్వహించారు. కలెక్టర్ వెంట పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్, లైజనింగ్ అధికారులు ఉన్నారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా జరిగినా.. జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్‌లో గల కాకతీయ మహిళా జూనియర్ కాలేజ్, గంగా క్యాంపస్ పరీక్షా కేంద్రానికి కేటాయించిన ప్రశ్నపత్రాల బుక్‌లెట్‌లలో మూడు ప్యాకెట్లు తక్కువగా వచ్చాయని ఆ పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్ బండిళ్లను తెరిచిన వెంటనే గుర్తించారని అన్నారు. ఈ విషయాన్ని జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లారు. వారు వెంటనే డిస్ట్రిక్ట్ బల్క్ నుంచి ప్రశ్నపత్రాల బుక్ లెట్‌లను పరీక్షా కేంద్రానికి పంపారు. దీనివల్ల సంబంధిత కేంద్రంలోని కేవలం ఒక పరీక్ష గదిలో అభ్యర్థులకు ప్రశ్నపత్రాల బుక్ లెట్‌లు అందించడంలో 14 నిమిషాలు ఆలస్యం అయ్యిందని అన్నారు. ఈ మేరకు వారికి కాంపెన్సేటరీ టైం ఇచ్చారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించామని కలెక్టర్ తెలిపారు.

పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించిన ఇంచార్జి పోలీస్ కమిషనర్..

కంఠేశ్వర్ : నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలో నిర్వహిస్తున్న గ్రూప్ 1 పరీక్షను 41 కేంద్రాల్లో ఏర్పాటు చేయగా వాటిని ఆదివారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సి. హెచ్.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నారు.



హాల్‌టికెట్ వివరాలను చూసుకుంటున్న అభ్యర్థులు



పరీక్షా కేంద్రంలోకి వెళ్లేందుకు క్యూ..

భారీ వాహనాల రాకపోకలతో భగీరథ పైపులు లీకేజీ

- కలుషితమవుతున్న తాగునీరు

నవతెలంగాణ-సదాశివనగర్



లీకేజీ అవుతున్న మిషన్ భగీరథ నీరు

తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా నీటిని అందిస్తున్నా పైపులైన్లు మాత్రం భారీ వాహనాలతో లీకేజీ అవుతున్నాయి. తద్వారా తాగునీరు కలుషితమవుతోంది. మండలంలోని మల్లుపేట స్టేజీవద్ద పైపులైన్ లీకేజీ అవుతుంది. మిషన్ భగీరథ పైపుపై నుంచి నిత్యం స్నేహ పౌల్ట్రీ ఫాంకు భారీ వాహనాలు వస్తూ పోతుంటాయి. ఆ వాహనాల వలనే పైపులైన్ లీకేజీ ఏర్పడుతుందని గ్రామ ప్రజలు తెలిపారు. అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టాలని, అలాగే పైప్‌లైన్ మీదుగా వాహనాలు వెళ్లకుండా కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సాలూర మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు

నవతెలంగాణ-బోధన్



సాలూరలో పాఠ్యపుస్తకాలు

ప్రభుత్వం జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలను పున:ప్రారంభిస్తున్నందున బోధన్, సాలూర మండలాలకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఆదివారం ఆయా మండలాలకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు మండల విద్యాధికారి కార్యాలయానికి చేరుకున్నాయి. సాలూర మండలానికి సంబంధించి 52,121 వేల పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు సిబ్బంది తెలిపారు. సోమవారం నుంచి పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ నాగనాథ్ తెలిపారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ నాగయ్య, సీఆర్పీలు బాబు, విజయ్, షఫీ యూసుఫ్, విజయ, స్వర్ణలత, దేవానంద్, అరవింద్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో సాహితీవేత్తల పాత్ర మరువలేనిది

- కత్తి కంటే కలం గొప్పదని కవులు తమ రచనల ద్వారా నిరూపిస్తున్నారు
- తెలంగాణ సాహిత్య దినోత్సవంలో పలువురు వక్తలు
- మహాకవి దాశరథికి ఘన నివాళి

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ సాహిత్య దినోత్సవం అట్టహాసంగా జరిగింది. కవులు, కవయిత్రులు, సాహితీవేత్తలు ఉత్సాహంగా తరలి వచ్చి తమ పద్య, వచన కవిత్వాలతో తెలంగాణ ఔన్నత్యాన్ని ఆవిష్కరింపజేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్ సాహిత్య సౌరభాల గుభాళింపులకు వేదిక అయ్యింది. ముందుగా ఖిల్లా జైలులోని ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు మహాకవి డాక్టర్ దాశరథి కృష్ణమాచార్యులు స్మారక భవనంలో మహాకవి దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి సాహిత్య దినోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, నగర మేయర్ దండు నీతూకిరణ్, అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, ప్రముఖ కవులు త్రివేణి, నరాల సుధాకర్, పీ.వీ.చందన్ రావు తదితరులు సాహిత్య దినోత్సవ కార్యక్రమానికి విచ్చేశారు. న్యూ అంబేద్కర్ భవన్ లో జాతీయ గీతాలాపన, జ్యోతి ప్రజ్వలనతో కవి సమ్మేళనం కార్యక్రమాన్ని ప్రారంభించి తెలంగాణ అమరవీరులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. జెడ్పీ చైర్మన్ సూచన మేరకు ములుగు జిల్లా పరిషత్ చైర్మన్ కుసుమ జగదీశ్ ఆకస్మిక మరణం పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరుస్తూ, కొద్దిసేపు మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన సాహితీవేత్తలు తమ సందర్భోచిత కవితా వచనాలతో ఈ కార్యక్రమానికి వన్నెలద్దారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యాన్ని, ఉద్యమ కాలం నాటి పరిస్థితులు, తెలంగాణ అమరుల త్యాగాలను గుర్తు చేస్తూ, వివిధ రంగాలలో తెలంగాణ సాధించిన అద్వితీయ ప్రగతి గురించి తమ కవితల ద్వారా హృద్యంగా ఆవిష్కరించారు. కవి సమ్మేళనం కార్యక్రమం ఆద్యంతం ఆసక్తిగా సాగుతూ అందరిని అలరింపజేసింది. తెలంగాణ ప్రాశస్త్యం, ఉద్యమ ప్రస్థానంలో నిజామాబాద్ గడ్డ పోషించిన పాత్ర, సాహితీ లోకంలో ఈ ప్రాంతానికి గల ప్రత్యేకత గురించి కవులు తమదైన శైలిలో కవితాత్మకత రూపంలో అభివర్ణించారు. ప్రస్తుత సమాజంలో సాహితీ రంగం పోషిస్తున్న పాత్ర గురించి విడమరచి చెప్పారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడుతూ.. కత్తి కంటే కలం ఎంతో గొప్పదని కవులు తమ రచనల ద్వారా అనేక సందర్భాల్లో నిరూపిస్తున్నారని అన్నారు. నాడు మహాకవి దాశరథిని నిజామాబాద్‌లోని ఖిల్లా జైలులో నిర్బంధించిన సమయంలో ఆయన జైలు గోడలపై బొగ్గుతో రాసిన నా తెలంగాణ కోటి రతనాల వీణ కవిత్వం అందరినీ ఉత్రూతలూగించిందని, ఉద్యమానికి ఊపిరులూదిందని గుర్తు చేశారు. మలివిడత తెలంగాణ ఉద్యమంలోనూ కవులు, కళాకారులు, సాహితీవేత్తలు పోషించిన పాత్ర మరువలేనిదని అన్నారు. అందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా వారిని కూడా సత్కరించుకోవాలనే ఉద్దేశంతో సాహిత్య దినోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. మహాకవి దాశరథి నిజామాబాద్ వాస్తవ్యులు కానప్పటికీ ఈ ప్రాంతంతో ఆయనకు విడదీయరాని బంధం ఏర్పడిందని అన్నారు. దాశరథిని నిర్బంధించిన నిజామాబాద్ ఖిల్లా జైలు గోడలపైన ఆయన రాసిన కవిత్వాలు ఎంతోమందిని ఉత్తేజపర్చాయని అన్నారు. సాహిత్యాన్ని ఎంతో ఎత్తుకు తీసుకెళ్లిన గొప్ప కవి అని కొనియాడారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాహిత్య దినోత్సవ కార్యక్రమానికి కవులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయడం ఎంతో సంతోషం కలిగించిందన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన కవులు, కళాకారులు, రచయితలను గౌరవించుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడిందన్నారు. ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ కవుల సాహిత్యానికి ప్రజా ఉద్యమాలతో ఎంతో సాన్నిహిత్యం ఉందని అన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని కీలక దశకు తీసుకెళ్లి చరిత్ర పుటలకెక్కిన ఘనత కవులు, కళాకారులదని గుర్తు చేశారు. కవులు, కళాకారుల ఆటా పాటలు ఎన్నో పోరాటాలకు ఫలితాలను అందించాయని, సబ్బండ వర్ణాలను ఏకతాటిపైకి తెచ్చాయని అన్నారు. ఉద్యమం చల్లారిన ప్రతీసారి తమ కవిత్వంతో అగ్గి రగిలించారని, సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్, సాగరహారం ఇలా ఎన్నో సందర్భాలలో తెలంగాణ కవులు ఉద్యమ ఉధృతికి బాటలు వేశారని కొనియాడారు. బతుకమ్మ, బోనాలు, రాస్తారోకోలు, రహదారుల బంద్, రోడ్లమీద వంటావార్పు-సామూహిక భోజనాలు వంటి ఉద్యమ రూపాలన్నీ కవిత్వంలోనూ భాగమయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులందరిని ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక, రూ.1116 నగదు పారితోషకంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీసీఓ సింహాచలం, బలభవన్ పర్యవేక్షకులు ప్రభాకర్, కవి సమ్మేళనం నిర్వాహక కమిటీ సభ్యులు గంట్యాల ప్రసాద్, డాక్టర్ వి.త్రివేణి, తిరుమల శ్రీనివాస్ ఆర్య, మద్దుకూరి సాయిబాబు, అధిక సంఖ్యలో కవులు, సాహితీవేత్తలు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.



కవులను సన్మానిస్తున్న జెడ్పీచైర్మెన్, మేయర్, తదితరులు

పాముకాటుతో హమాలీ మృతి

- మృతుడు బీహార్ వాసి

నవతెలంగాణ-నవీపేట్

పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ శివారు నీలకంఠ ట్రేడర్స్ రైస్ మిల్ నందు హమాలీగా పనిచేస్తున్న రంజన్ కుమార్ (45) పాముకాటుతో ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపా రు. బీహార్ రాష్ట్రం, ఖగారి యా జిల్లా, పిప్పర్ పంతి గ్రామానికి చెందిన రంజన్ కుమార్ భార్యతో కలిసి పది రోజులుగా రైస్ మిల్లులో హమాలీ పని చేస్తున్నాడు. ఆదివా రం ఉదయం 3 గంటలకు నిద్ర పోతున్న సమయంలో వీపుపై పాము కాటు వేయడంతో గమనించి న భార్య తోటి హమాలీల సాయంతో పామును చంపివేసి చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించా రు. సాయంత్రం మృతి చెందాడు. భార్య కిరణ్ దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ జిల్లా ఒలంపిక్ ఉపాధ్యక్షులు, ధర్పల్లి మండల జడ్పిటిసి బాజిరెడ్డి జగనన్ నివాసంలో మల్కాపూర్ తాండ గ్రామానికి చెందిన మూడ్ భాస్కర్‌కి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరైన 22వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కుని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మల్కాపూర్ తండా మాజీ ఎంపీటీసీ కేతావత్ గంగారాం నాయక్, జెడ్పిటిసి బోలెంక సుమలత గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆపద్బంధువులా అనాథలకు సేవలు

- ఇందూరు యువత స్వచ్ఛంధ సేవా సంస్థ ద్వారా అభ్యాగులకు చేయూత
- 2011నుంచి సేవలు
- రోగులకు, వృద్ధులకు నిత్యాన్నదానం
- ఎవరూలేనివారి మృతదేహాలకు అంతిమసంస్కారాలు
- తన జీవితమే సేవకు అంకితం : సాయిబాబు

కుళ్ళు పట్టిన శరీరాలకు ఆయన ఓ సంజీవని, రోడ్లు, కూడళ్ళ చుట్టే ఆయన ప్రయాణం. చీము పట్టినా కాళ్ళకు పుండ్లునుండి రక్తం కారే అభాగ్యుల కోసమే ఆయన అన్వేషణ. తల్లి బిడ్డకు సేవ చేసినట్టే ఆయన అనాధలకు విధివంచితులకు నిరాశ్రయులకు ఆప్తుడై ఆత్మీయునిగా మారాడు సాయిబాబు. మానవ సేవే మాధవ సేవ అనే నానుడి ఇలాంటి వారి సేవలు చూసినప్పుడే నిజమనిపిస్తుంది. అందరూ ఉన్నా పట్టించుకోని ఈరోజుల్లో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్తను స్థాపించి అనాథలకు, అభాగ్యులకు అండగా ఉంటూ అంత్యక్రియలుసైతం నిర్వహిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు.

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా ప్రాంతానికి చెందిన డాక్టర్ మద్దుకూరి సాయిబాబు 2011లో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థని స్థాపించి అనాధలకు, అభాగ్యులకు అండగా నిలుస్తున్నాడు. అలాంటి వారిని చూస్తేనే అసహ్యం వేస్తుంది. వాళ్ళు ఎదురైతేనే ఒళ్ళు జలదరిస్తుంది. పెరిగిన గడ్డం, అట్టలుకట్టిన జుట్టు, అంధవికారంగా, నగ్నంగా, అర్ధనగ్నంగా రోడ్లపై నిస్సహాయ స్థితిలో తిరుగుతూ ఉంటారు. అలాంటి వారు సాయిబాబుకి కనపడితే చాలు తనవెహికిల్ డిక్కీ ఓపెన్ అవుతుంది. అందులో అన్ని దూది ఉండలు, పుండ్లమందులు, పట్టీలే కనపడుతు ఉంటాయి. వాటిని తీసి ఫుట్ పాత్‌లపై రోగ గ్రస్తంగా ఉన్న వారి పక్కన కూర్చుని ఆ పుండ్లని క్లీన్ చేసి పట్టి కడుతుంటాడు. వారి ఆకలి తీరుస్తుంటాడు. మానవత్వమే నిజమైన దైవత్వం అని తను నమ్మే మెదటి సిద్ధాంతమని సాయిబాబు అంటారు. రోడ్లపై ఆనాథలు విధివంచితులు చనిపోతే ఆ అనాధ మతదేహాలకు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తారు పోలీసుల అనుమతితో....ఇప్పటి వరకు 75 అనాధ శవాలకి అంతిమ సంస్కారాలు నిర్వహించామని ఆయన తెలిపారు.

రోజు 200 మందికి అన్నదానం

ఇందూరు క్యాన్సర్ ఆస్పత్రికి వివిధ ప్రాంతాలనుంచి వచ్చే రోగులకు వారి సహాయకులకు అనంతరం రోడ్లపై నిస్సహాయ స్థితిలో ఉన్న వద్దులు, అనాధలకు నిరంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.సాంస్కతిక కార్యక్రమాలను నిర్వహిస్తు యువతలో దాగి ఉన్న ప్రతిభా పాతవాలు వెలికి తీస్తూ యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసేలా కార్యక్రమాలను నిర్వహిసా ్తమన్నారు. ఈ ఇందూరు యువత స్వచ్చంద సేవా సంస్థలో 180 మంది సభ్యులు ఉన్నారు ప్రతి నెల మెంబర్ షిప్ పేమెంట్ వేసుకుంటూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో రిటైర్డ్ ఎంప్లాయిస్, , ప్రభుత్వ ఉద్యోగులు, యువకులు ఉన్నారు వివిధ మండలాల్లో కమిటీలను ఏర్పాటు చేసి యువతను సేవా కార్యక్రమాల్లో రాణింపచేస్తున్నారు.



నిత్యాన్నదానంలో..



అనాథ శవానికి అంత్యక్రియలు చేస్తూ...

అందరి సహకారంతో

జిల్లా అధికారులు, పోలిస్ యంత్రాంగం, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, వివిధ హాస్పిటళ్ల వైద్యుల సహకారం ప్రోత్సాహం మరువలేనిదని తెలిపారు.

ఆశ్రమం ఏర్పాటే మా లక్ష్యం..

జిల్లాలో మనశ్శాంతి కోవెల ఆశ్రమం ఏర్పాటుకు సంబంధించి జిల్లా రాజకీయ నాయకులు, అధికారులు, అనధికారుల అందరి సహకారం అందిస్తారని ఆశిస్తున్నాం.



అనాధ వృద్ధునికి సపర్యలు చేస్తున్న యువకులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవస్థాపకులు సాయిబాబు

ఈటలను కలిసిన మాజీ ఎంపీపీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ధర్పల్లి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి ఆదివారం హుజురాబాద్ ఎమ్మెల్యే బీజేపీ చేరికల కమిటీ కన్వీనర్ ఈటెల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. త్వరలో రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రస్తుతం ఇమ్మడి గోపి సైతం ఎమ్మెల్యే టికెట్ రేసులో ఉండడంతో తన వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

శ్రీరామ ఆర్థో ఆస్పత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని శ్రీరామ ఆర్థో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎ ఆదివారం స్థానిక ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్పిటల్‌కు వచ్చే ప్రజలకు మంచి సేవలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సాహితి పటేల్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ నాగరాజు ,ఆర్థో వైద్యులు అమత్ రాంరెడ్డి, ఆశ హాస్పిటల్ వైద్యులు చంద్రశేఖర్, బాలాజ్ హాస్పిటల్ వైద్యులు రాకేష్,, డాక్టర్ మధుశేఖర్,, బి ఆర్ఎస్ నాయకులు పండిత్ పవన్,, అయ్యప్ప శ్రీనివాస్, సర్వ సమాజ్ అధ్యక్షులు ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

చలో ఉస్మానియా కార్యక్రమం విజయవంతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

చలో ఉస్మానియా కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు డాక్టర్ పి దత్తహరి తెలిపారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులర్ చేయాలని సీఎం సంతకం పెట్టారని, కానీ సీఎం ఆఫీసులో ఒక ఉన్నతాధికారి ఆ ఫైల్‌ని పైకిరాకుండా అక్కడే ఆపుతున్నారని మండి పడ్డారు. ఒక అధికారి ఇలా చేసినట్లు తమకు సమాచారం అందిందని తెలిపారు. మా రెగ్యులరైజ్ ఫైల్ ని ఆపటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆ అధికారి అసలు రంగు బయట పెడ్తామని అన్నారు. రెగ్యులరైజ్ అయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. దీనిపై ఉస్మానియా జాక్ రథసారథి డాక్టర్ పరశురాం, జాక్ కన్వీనర్ డాక్టర్ కరుణాకర్, కాకతీయ యూనివర్సిటీ 12 యూనివర్సిటీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు అందరు కలిసి ఏకగ్రీవంగా తీర్మానం చేశామని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గంగ కిషన్, జాక్ కన్వీనర్ డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ నారాయణ గుప్తా, జాక్ కన్వీనర్ డాక్టర్ గోపిరాజు, డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ డానియల్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సురేష్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

- సీపీఐ(ఎం) నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న రమేష్‌బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల పోరాట కార్యకర్తలకు రాజకీయ శిక్షణ తరగతులు నాందేవ్ వాడలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించి మతోన్మాద చర్యలకు పాల్పడుతుందని అన్నారు, మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలను సష్టించి తమ రాజకీయ పబ్బం నెట్టుకొస్తున్నారని తెలిపారు. బిజెపి మత విద్వేష రాజకీయాలను ప్రజల ఐక్యంగా తిప్పి కొట్టాలని, ప్రజా సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు, కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట రాములు, మల్యాల గోవర్ధన్, నగర కార్యదర్శి పెద్ది సూరి, నగర కమిటీ సభ్యులు ద్యారంగుల కష్ణ, బొప్పిడి అనసూజ, తదితరులు పాల్గొన్నారు.

బోదేపల్లిలో ధ్యానంపై అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్

బాల్కొండ మండలం బోదే పల్లి గ్రామంలో పీఎస్ఎస్ ఎం.నవనాథపురం ఆర్మూర్ కమిటీ ఆధ్వర్యంలో పిరమిడ్ మాస్టర్లు. మీసాల అనిత రాజు దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం, శాఖాహార ర్యాలీ, ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ సీనియర్ పిరమిడ్ మాస్టర్ కుమారి ఏంజెల్ స్వాతి మాట్లాడుతూ.. ప్రతిరోజు ప్రతి ఒక్కరు ధ్యానం యోగ చేయాలన్నారు. ధ్యానం విశిష్టతపై వివరించారు. కార్యక్రమంలో పీఎస్ఎస్ఎం నవనాథపురం కమిటీ సభ్యులు అడ్వకేట్ సాయికష్ణారెడ్డి , తిరుమల గంగారాం, కూనింటి, శేఖర్ రెడ్డి ,అమరవాజి శ్రీనివాసు నారాయణ ,రాజారాం, నవంపేట్ శ్రీనివాస్ అమత రావు, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు లిటిల్ ఫ్లవర్‌లో ఉచిత శిక్షణ

- 14 ఏండ్లుగా 450 మంది విద్యార్థులు గురుకులాలకు ఎంపిక
- ఫీజు లేకుండా గురుకుల ప్రవేశ పరీక్షకు శిక్షణారగతులు
- సాంస్కతిక కార్యక్రమాల్లో అవార్డులు

నవతెలంగాణ-మెండోర

శ్రమ నీ ఆయుధం అయితే విజయం నీ బానిస అవుతుంది. మీ పిల్లల కోసం శ్రమిస్తాం - మీ కలలను సాకారం చేస్తాం అనే నినాదంతో విద్యను బోధిస్తున్నామని వెల్గటూర్ లిటిల్ ఫ్లవర్ గ్రామర్ హైస్కూల్ కరస్పాండెంట్ అజ్మత్ పాష తెలిపారు.

మండలంతోపాటు ఇతర ప్రాంతాల చిన్నారులకు కార్పొరేట్ స్థాయిలో ఉన్నత విద్యను అందిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్టు ఏకైక విద్యా సంస్థ అని అన్నారు. 14 సంవత్సరాలుగా వరుసగా వందశాతం ఉత్తీర్ణత సాధిస్తూ గురుకుల కోచింగ్‌ను అందిస్తూ 2022-23 విద్యా సంవత్సరంలో గురుకుల కోచింగ్ ఉచితంగా అందించగా 45 మంది విద్యార్థులను ప్రభుత్వ గురుకుల పాఠశాలలో సీట్లు సాధించారన్నారు. అందులో పోచంపాడ్‌లోని టిఎస్ఆర్ జెసి పాఠశాలలో 18 మంది విద్యార్థులు ఉన్నత ర్యాంకులు సాధించి సీట్లు సంపాదించినట్లు పాఠశాల కరస్పాండెంట్ అజ్మత్ పాషా తెలిపారు. విద్యా సంస్థ ప్రారంభం నుండి ఇప్పటి వరకు 450 మంది విద్యార్థులను ప్రభుత్వ గురుకుల పాఠశాలలలో చేర్పించిన ఘనత లిటిల్ ఫ్లవర్ గ్రామర్ హై స్కూల్ వెల్గటూర్‌కు దక్కిందన్నారు. మండలంలో ఒలింపిక్ ఎగ్జామినేషన్‌లో ప్రిలిమినరిలో జిల్లాస్థాయి అర్హత సాధించిన మొట్ట మొదటి పాఠశాలగా సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించి సాంస్కతిక పోటీలలో జిల్లా స్థాయిలో ప్రతిభ కనుపరిచిన విద్యాసంస్థగా పేరుపొందిందని తెలిపారు. అధిక ఫీజులు లేకుండా విద్యార్థులకు విద్యలో మెళకువలు నేర్పుతూ సాంస్కతిక కార్యక్రమాలలో పాల్గొని అవార్డులు సాధించేలా చిన్నారులకు ప్రోత్సాహం అందిస్తుమని అన్నారు.



గురుకులానికి ఎంపికై విద్యార్థులతో కరస్పాండెంట్ అజ్మత్‌పాష

సొంతగూటికి వెంకటరామిరెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

బిజెపి సీనియర్ నాయకులు, ఉద్యమకారుడు నిజామాబాద్ ఉమ్మడి జిల్లా టిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులుగా, తాడ్వాయి మండల పార్టీ అధ్యక్షులుగా ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన మాజీ ఎమ్మెల్యే దగ్గర అనుచరుడుగా ఉన్న పైడి వెంకటరామిరెడ్డి తిరిగి సొంతగూటికి చేరారు. ఆదివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అధ్వర్యంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో హైదరబాద్‌లో గులాబీ కండువా కప్పుకున్నారు.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణకి కేసిఆర్ వల్లే అభివద్ధి అని మోడీ విధానాలు బిజెపి విధానాలు తెలంగాణకి ద్రోహం తప్ప ఒరిగేదేంలేదని టీఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగిందని చెప్పారు. ఆయనతోపాటు చిట్టి గంగారం, కురుమ సంఘం మండల అధ్యక్షులు జైపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, చాకలి సాయిలు, శ్రీకాంత్ రెడ్డి, సంజీవరెడ్డి పార్టీలో చేరారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అప్పుల బాధ తో మనస్థాపం చెంది ఉరేసుకుని ఓయకువుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నరేష్ వివరాల ప్రకారం.. ఇందల్ వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన వడ్ల గంగాధర్ (36) అప్పులు కావడంతో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం మద్యం సేవించి ఇంటికి వెళ్లాడు. భార్య నిజామాబాద్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తుండడంతో ఇంట్లో కుమారుడు, కూతురు ఉండగా బెడ్ రూమ్ లోకి వెళ్లి లోపల నుండి గొళ్లెం పెట్టుకున్నాడు. ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శబ్దం రావడంతో పిల్లలు భయపడి బెడ్ రూమ్ తలుపులు తీసేందుకు యత్నించగా లోపల నుండి గొళ్లెంపెట్టిఉంది. పిల్లల అరుపులు ఏడ్పులు విని పక్కింటి వారు గమనించి ఏమైందో తెలియక సర్పంచ్ లోలం సత్యనారాయణ, ఉప సర్పంచ్ రఘునథన్ రాము కు సమాచారాన్ని అందించారు. వెంటనే సర్పంచ్, ఉపసర్పంచ్ అక్కడికి చేరుకున్నారు. తలుపులు తీసి చూడడంతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్టు కనిపించింది వెంటనే ఇందల్‌వాయి ఎస్ఐ నరేష్ కుమార్ కు సమాచారం అందించగా ఘటన స్థలానికి ఎస్సై చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఇందూరు కవులకు ఘన సన్మానం



కవిని సత్కరిస్తున్న ప్రముఖులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం రవీంద్రభారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కవిసమ్మేళనంలో ఇందూరు కవులు ఘనపురం దేవేందర్, డా.కాసర్ల నరేశ్ రావులకు ఘనసత్కారం పొందారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కవిసమ్మేళనంలో మొదటి విభాగంలోని పద్యకవితా సదస్సులో డా.కాసర్ల నరేశ్‌రావు తెలంగాణను నేను అనే శీర్షికతో పద్యాలను వినిపించారు. తర్వాతి సభలో ఘనపురం దేవేందర్ ఇంద్రభయంకరుడు అనే వచనకవితను వినిపించారు. వీరిద్దరినీ తెలంగాణ సాహిత్య అకాడమి అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్, గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అయాచితం శ్రీధర్, శాసనమండలి సభ్యులు వాగ్గేయకారులు గోరేటి వెంకన్న, తెలంగాణ భాషా సాంస్కతికశాఖ కార్యదర్శి మామిడి హరికృష్ణ ఘనంగా సత్కరించారు. ఈ సభలో కవులు, కళాకారులు పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఇందూరు కవుల ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో పెంచిన ఇందూరు ఇద్దరు కవులను జిల్లా కవులు, కవయిత్రులు డాక్టర్ త్రివేణి, మల్లవరపు చిన్నయ్య పంచ రెడ్డి లక్ష్మణ్, చందన్ రావు, కర్క రమేష్,సాయి బాబు, కళ గోపాల్‌లు అభినందించారు.

మొరం తెచ్చిన తంటా

- ఇరు గ్రామాల మధ్య ఘర్షణ..



ఘర్షణ పడుతున్న ఇరుగ్రామాల ప్రజలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండలంలోని అమృతాపూర్ గ్రామస్థులు, ఒడ్డెర కాలనీ వాసులు ఆదివారం ఎర్రకుంటలో మొరం తవ్వకాల విషయంలో ఘర్షణకు దిగారు. ఇరు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో ఎర్రకుంటకు తరలిరావడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అమతాపూర్ వాసులు ఊళ్లో అవసరాల నిమిత్తం మొరం తవ్వకాలు చేపట్టగా ఒడ్డెర కాలనీ వాసులు అడ్డుకున్నారు. దీంతో ఇరు గ్రామాల మధ్య నెలకొన్న వాగ్వాదం తీవ్ర ఘర్షణకు దారి తీసింది. ఈ విషయం తెలియడంతో డిచ్‌పల్లి ఎస్ఐ కచ్చకాయల గణేష్ పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకుని ఇరు గ్రామాల ప్రజలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వారు ఎంతకూ వినిపించుకోలేదు. అయితే మట్టి, మొరం తవ్వకాల్లో తమకు వాటా ఇస్తామని అమృతాపూర్ గ్రామస్థులు గతంలో మాట ఇచ్చి, ఇప్పుడు వాటా ఇవ్వడం లేదని ఒడ్డెరకాలనీ వాసులు వాపోయారు. మొరంను తమ ఊళ్లో ఇళ్ల నిర్మాణ అవసరాల కోసమే తీసుకెళ్తున్నాం తప్ప విక్రయించడానికి కాదంటూ అమతాపూర్ గ్రామస్థులు వాదించారు. సుమారు రెండున్నర గంటల పాటు ఇరు గ్రామాల జనం వాదనలకు దిగారు. అమృతాపూర్ గ్రామస్థులు ఎంపీటీసీ సాయిలుకు వ్యతిరేకంగా, ఒడ్డెర కాలనీ వాసులు సర్పంచి భర్త నర్సింగ్ రావుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఒకరికి ఒకరు నినాదాలు చేసుకున్నారు. ఎట్టకేలకు పోలీసులు నచ్చజెప్పడంతో ఇరు వర్గాల ప్రజలు శాంతించారు. అమృతాపూర్ గ్రామస్థులు, ఒడ్డెరకాలనీ వాసులు ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసేందుకు వేర్వేరుగా ట్రాక్టర్లలో తరలివెళ్లారు. సామరస్యంగా సమస్య పరిష్కరించుకుని కలిసి మెలిసి ఉండాలని ఎమ్మెల్యే వారికి సూచించినట్లు సమాచారం.

చెరువులో పడి ఒకరి మృతి

- ఘన్‌పూర్‌లో ఘటన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘనపూర్ గ్రామంలో చెరువులో పడి ఓ యువకుడు మృతిచెందాడు. బుర్రె ప్రవీణ్ (27) శనివారం గొర్రెలను మేపటానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. ఆదివారం ఉదయం ఘనపూర్ చెరువు లోపడి మృతిచెంది ఉన్నాడు. మతుని భార్య బుర్రె అనూష పిర్యాదు మేరకు కేసు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని మార్చురీకి తరలించి నట్లు ఎస్సై కచ్చకాయల గణేష్ తెలిపారు.

రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను విజయవంతం చేయాలి

- కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-బాల్కొండ

ఈనెల 18న నిర్వహించే రాజీవ్ గాంధీ యూత్ ఆన్ లైన్ క్విజ్ పోటీలను విజయవంతం చేయాలని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి కోరారు. ఆదివారం కిసాన్ నగర్‌లో నిర్వహించిన బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజీవ్ గాంధీ యూత్ ఆన్ లైన్ క్విజ్ పోటీలో నిజామాబాద్ జిల్లాలోని 16 నుండి 35 సంవత్సరాలు గల వారు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 20వేకు తగ్గకుండా రిజిస్ట్రేషన్లు చేయించాలని ఆయన కోరారు. అన్ని విభాగాలు జిల్లా, మండల, గ్రామస్థాయి అధ్యక్షులు, కార్యదర్శులు ముఖ్యంగా ఎన్ఎస్ యుఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు నిరుద్యోగ యువతీ యువకులతో పాటు విద్యార్థిని విద్యార్థులను కలిసి వారికి ఆన్ లైన్ చేయించాలన్నారు.ఈ పోటీలో పాల్గొనాలనుకునే అభ్యర్థులు ముందుగా 7661899899 గల నెంబర్ కు మిస్డ్ కాల్ ఇచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్ వెబ్ లింక్ తో కూడిన ఒక ఎస్ఎంఎస్‌ను పొందుతారని, ఆ లింకు ద్వారా వారి వివరాలను మానాల, ఈరవత్రి అనే రిఫరల్ కోడ్ ద్వారా ఈనెల 17 లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీలో పాల్గొన్న అభ్యర్థులకు (అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రథమ బహుమతి ల్యాప్ టాప్, ద్వితీయ బహుమతి స్మార్ట్ ఫోన్, తతీయ బహుమతి ట్యాబ్ లెట్‌తోపాటు ప్రతి నియోజకవర్గంలో 40 ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రోత్సాహక బహుమతులలో 10 స్మార్ట్ వాచీలు, 10 ఇయర్ పాడ్లు, 10 హార్డ్ డ్రైవ్ లు,10 పవర్ బ్యాంకులు బహుమతీగా అందించడం జరుగుతుందన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని మహిళా టాపర్లకు ప్రత్యేక బహుమతులు ఎలక్ట్రిక్ స్కూటర్లను కూడా బహుకరించడం జరుగుతుందని, ఈ బహుమతిని సోనియా గాంధీ హైదరాబాదులో ప్రధానం చేస్తారని ఆయన తెలియజేశారు. ఈ ఆన్ లైన్ క్విజ్ పోటీలో 60 నిమిషాల్లో 60 ప్రశ్నలకు సమాధానం ఇవ్వవలసి ఉంటుందన్నారు. భారతదేశ భౌగోళిక చరిత్ర, స్వాతంత్ర ఉద్యమం, తెలంగాణ సంస్కతి, చరిత్ర, సామాజిక ఉద్యమాల తోపాటు జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, అర్థమెటిక్ రీజనింగ్ అంశాలపై ప్రశ్నలు ఉంటాయని ఆయన తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే వాటి నివత్తి కోసం 8142903456, 8142803456 నెంబర్లకు కాల్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ముప్కల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు క్యాతం గంగారెడ్డి, బాల్కొండ మండల అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, మెండోరా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం రెడ్డి, ఎన్ఎస్ యుఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు వరదబట్టు వేణురాజ్, బోదేపల్లి రాజు, అబ్రార్, ముప్కల్ మండల మైనారిటీ ప్రెసిడెంట్, పోలా ప్రవీణ్ ముప్కల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి, ఎంపీటీసీ సాయి, మాజీ సర్పంచ్ రమేష్, చిట్టాపూర్ ప్రవీణ్, పోచంపల్లి నవీన్, ముత్యం రెడ్డి గోపాల్, డిసిసి డెలిగేట్ జైడి రవి, బద్దంసాగర్, లక్ష్మణ్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

మూడేండ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి


చికిత్స పొందుతున్న బాలుడు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని ముద్దెళ్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం మూడేండ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. గ్రామానికి చెందిన మూడేండ్ల బాలుడు లక్ష్మణ్‌పై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో చికిత్స నిమిత్తం గాంధారి ఆసుపత్రికి తరలించారు.

బీఆర్ఎస్‌లో పలువురు చేరిక

నవతెలంగాణ-తాడ్వాయి

మండలానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో వారు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీజేపీ సీనియర్ నాయకులు పైడి వెంకటరామిరెడ్డి, కురుమ సంఘం మండల అధ్యక్షులు చెట్టే గంగారంలతోపాటు జైపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సాయిలు, శ్రీకాంత్, సంజీవరెడ్డి పలువురు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమై తాము బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని వారు ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా

- తప్పిన పెనుప్రమాదం
- తక్కడపల్లి గ్రామ శివారులో ఘటన


లారీ డ్రైవర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

లారీ బోల్తాపడింది. ఈ ఘటన మండలంలోని తక్కడపల్లి గ్రామ శివారులో ఆదివారం తెల్లవారుజామున 5:30 గంటలకు చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా మిర్యాలగూడ నుంచి మహారాష్ట్ర రాష్ట్రంలోని నాందేడ్ జిల్లాకు వెళుతున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో లారీ డ్రైవర్ సతీష్ లారీలో ఇరుక్కుపోవడంతో దాదాపు గంటన్నర పాటు జాతీయ రహదారి ప్రమాదాల నిషేధిత అధికారి ప్రతాప్ సింగ్ వారి బృందం, స్థానిక ట్రాక్టర్ల సహాయంతో గంటన్నర పాటు కష్టపడి డ్రైవర్ సతీష్‌ను సురక్షితంగా బయటకు తీశారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. లారీలో డ్రైవర్‌తో పాటు క్లీనర్ విశ్వనాథ్, రోహిత్ ఉన్నారని వారికి సైతం ఎటువంటి గాయాలు కాలేదని పేర్కొన్నారు.

శాలివాహన సంఘం నూతన కార్యవర్గాల ఎన్నిక


జుక్కల్ : ఎన్నికైన జుక్కల్ మండల కార్యవర్గం

నవతెలంగాణ-జుక్కల్/మద్నూర్

జుక్కల్ మండల శాలివాహన (కుమ్మరి) సంఘం నూతన కార్యవర్గం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని గోరకుంబార ఆలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడుగా నర్సింహులు, అధ్యక్షులుగా సాయిలు, ఉపాధ్యక్షులుగా హనుమంతు, ప్రధాన కార్యదర్శిగా బాలన్న, కోశాధికారిగా సంగ్రాం, సహాయ ఉపాధ్యక్షులుగా మల్లేష్, సహయ కార్యదర్శులుగా సంతోష్, జ్ఞానేశ్వర్, సలహాదారుగా రాజు, తుకారం, బాలును ఎన్నుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతి మండలంలో కుమ్మరులను ఏకతాటిపైన తెచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు.

మద్నూర్ : మండలంలోని కుమ్మర (శాలివాహన) సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు జిల్లా అధ్యక్షుడు కుమ్మరి రాములు పేర్కొన్నారు. ఆదివారం మద్నూర్ మండల కేంద్రంలోని జీవీఆర్ కల్యాణ మండపంలో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కొడిచర్ల గంగాధర్, అధ్యక్షులుగా విజయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా సంజు, ప్రధాన కార్యదర్శిగా విఠల్, కోశాధికారిగా సచిన్, సహాయ ఉపాధ్యక్షులుగా అశోక్, సలహాదారులుగా లక్ష్మణ్, వీరన్న తదితరులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో కుమ్మరులను ఏకతాటిపైకి తెచ్చేందుకు కృషి చేస్తూ అందులో భాగంగా మండల కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మోహన్, జిల్లా ఉపాధ్యక్షులు ధర్పల్లి శివకుమార్, మద్నూర్ మండల కుమ్మర (శాలివాహన) కులస్తులు గంగాధర్, చిన్న వీరేశం హనుమాన్లు, అశోక్, సాయినాథ్, రామ్, మారుతి తదితరులు పాల్గొన్నారు.


మద్నూర్ : ఎన్నికైన మద్నూర్ మండల కార్యవర్గం

తగ్గెల్లి, ఫతేపూర్‌లో క్విజ్‌పై అవగాహన

నవతెలంగాణ-బోధన్


క్విజ్ పోటీలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ ఇన్స్‌పిరేషన్‌తో జూన్ 18న, యువతలోని నైపుణ్యాన్ని వెలికితీయడానికి, రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో భాగంగా ఆదివారం సా లూర మండలంలోని తగ్గెల్లి, ఫతేపూర్ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీల నాయకులు ఆన్‌లైన్ క్విజ్‌పై యువకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి దొడ్ల రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ క్విజ్‌లో పాల్గొని 60 నిమిషాల్లో, 60 మల్టీపుల్ ఛాయిస్ క్వశ్చన్స్‌కు ఆన్సర్ చేయాలని తెలిపారు. ల్యాప్‌టాప్, ట్యాబ్, స్మార్ట్‌ఫోన్, స్మార్ట్‌వాచ్ లాంటి బహుమతులను గెలుచుకోవచ్చని వారికి సూచించారు. ప్రత్యేక బహుమతిగా బోధన్ నియోజకవర్గ మహిళా టాపర్‌కు ఎలక్ట్రిక్ స్కూటీని అందజేస్తారని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ వెంటనే 7661899899 నెంబర్‌కు ఒక్క మిస్డ్ కాల్ ఇచ్చి మీ గ్రామంలో ఉన్న ప్రతి ఒక్క యువకులు రిజిస్టర్ చేసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ దేవారావ్, గౌస్, గంగాయప్ప, శివ, శ్యామ్, సాయిలు, జ్ఞానేశ్వర్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం పడితే అంతే..

- అడుగు వేసి అడుగు తీయలేని పరిస్థితి
- ఎడపల్లి గురుకుల బాలికల పాఠశాల, కళాశాల దుస్థితి
- ముందుగానే సమస్య పరిష్కరించాలంటున్న విద్యార్థులు


వర్షం పడిన వేళ పాఠశాల ఆవరణ (ఫైల్)


సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో (ఫైల్)

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి మండల పరిధిలో గల తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రతి వర్షాకాలం సమస్యలకు నిలయంగా మారుతోంది. వర్షం పడితే చాలు.. పాఠశాల కళాశాల ఆవరణం మొత్తం నీటితో నిండుతోంది. దీంతో విద్యార్థులు అడుగు తీసి.. అడుగు వేయాలేని పరిస్థితి నెలకొంది. పాఠశాలలు పున:ప్రారంభమవుతున్న నేపథ్యంలో ముందుగానే సమస్యను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, అధికారులను విద్యార్థులు కోరుతున్నారు.

2022 విద్యాసంవత్సరాల కాలంలో వర్షాకాలం భారీగా వర్షాలు కురవడంతో వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లాయి. తద్వారా వర్షపు నీరు పాఠశాలలోకి చేరుకుంది. పాఠశాలకు సమీపంలోని పెద్ద వాగు ద్వార దిగువ ప్రాంతానికి వర్షపు నీరు వెళ్తుంది. ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీరు అత్యధికంగా ఉధృతం కావడంతో మిగిలిన నీరు పాఠశాలలోకి చేరుకోవడం వల్ల పాఠశాల ఆవరణం చెరువులను తలపిస్తుంది. పైగా పాఠశాల పక్కనే పంట పొలాలు ఉన్నందున గతంలో సుమారు 10 రోజులపాటు కురిసిన వర్షం వల్ల పాఠశాలలోనే వర్షపు నీరు నిండిపోయి ఉండడం వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థినీలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మరోవైపు వంటగదిలోకి నీరు పోవడం వలన నిర్వాహకులు సైతం అనేక ఇబ్బందులు పడ్డారు. పాఠశాలలో నిలిచిన నీరు బయటకు వెళ్లడం కష్టంగా ఉందని బాలికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో బోధన్ ఆర్డీవో రాజేశ్వరరావు, ఎడపల్లి సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లడంతో వారు పాఠశాలను సందర్శించి బాలికలకు, ఉపాధ్యాయులకు రక్షణగా నిలిచారు. బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ రావు పాఠశాలను సందర్శించి పాఠశాలలో మోకాలులోతు వరకు నిలిచిపోయిన నీరు బయటకు వెళ్లేందుకు కృషి చేశారు. బోధన్ ఆర్డీవో ప్రతిరోజు పాఠశాలకు చేరుకొని పిల్లలకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేస్తూ బాలికలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో భోజనం అందేలా చర్యలు తీసుకున్నారు.

పాఠశాల ఆవరణంలో మట్టి ఉండడం వలన దానిపైన సీసీ పోస్తే బాగుంటుందని బాలికలు భావిస్తున్నారు. కనీసం కంకర డస్ట్ వేసిన కూడా నేల గట్టిగా ఉంటుందని బాలికలు అంటున్నారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమయ్యే సమయం ఆసన్నమైనందున ప్రభుత్వం స్పందించి ఈ సమస్యను పరిష్కరించేలా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

తెలంగాణలో సంక్షేమం, అభివృద్ధి

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ


సహాయనిధి చెక్కును అందజేస్తున్న గంప గోవర్ధన్

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. ఆదివారం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను కామారెడ్డి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి నియోజకవర్గంలోని 71 మందికి 22లక్షల 24 వేల 500 రూపాయల చెక్కులను పంపిణీ చేశామన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ బీమా చెక్కులను పంపిణీ చేశారు. రాజంపేట్‌కు చెందిన మెత్తల అశోక్ మరణించగా అతని తల్లి మెత్తల సంగవ్వకు, రాజంపేట్‌కు చెందిన దెబ్బల రవి మరణించగా అతని భార్య స్రవంతికి, గజ్యానాయక్ తాండకు చెందిన కొడిమ్యల రాజయ్య మృతి చెందగా అతని భార్య లక్ష్మికి, కామారెడ్డికి చెందిన జెంక రవి మరణించగా అతని కుమారుడు శీజన్ కుమార్‌కు ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున నలుగురికి మొత్తం రూ.8లక్షల చొప్పున బీఆర్ఎస్ పార్టీ ప్రమాదబీమా చెక్కులను అందజేశామని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 1972 మందికి 11 కోట్ల 97లక్షల 6 వేల 7 వందల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఇప్పించినట్టు వివరించారు. కార్యకర్తల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచించి ప్రమాద బీమా చేయించారని అన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన పేదలు అనారోగ్యం పాలై ఆసుపత్రిలో ఖర్చయినా డబ్బులను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఇప్పిస్తున్నామని అన్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన తర్వాత సంబంధిత పత్రాలను తమ కార్యాలయంలో ఇస్తే వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేస్తానని చెప్పారు.

పీఎం చిత్రపటానికి పాలాభిషేకం


మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. మండలంలోని జాన్కంపేట్, మంగల్‌పాడ్, జంలం, ఏఆర్పీ క్యాంపు, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాల్లో బీజేపీ శ్రేణులు, రైతులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, జాన్కంపేట్ సర్పంచ్ సాయిలు మాట్లాడుతూ.. రైతులను ఆదుకోవడం మోడీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వరి పంటకు రూ.143 మద్దతు ధర పెంచడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. మద్దతు ధర పెంచడంతో ఎకరాకు సుమారు రూ.5వేల వరకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. అంతే కాకుండా (ఫర్టిలైజర్) ఎరువుల మందులపై రూ.200 వరకు ధర తగ్గించడంతో రైతుకు ఎకరానికి రూ.10వేల వరకు ఆదా అవుతుందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని పీఎం మోడీ రుజువు చేశారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు ఉప్పు సురేష్, సృజన్, హరీష్, మురళి, సతీష్ గౌడ్, ప్రవీణ్, లింగం, సాయిలు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలీస్ శాఖ 'తెలంగాణ రన్'

- పలు మండలాల ఎస్ఐల వెల్లడి


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/జుక్కల్/మద్నూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో సోమవారం ఉదయం 6గంటలకు పోలీస్ శాఖ నేతృత్వంలో తెలంగాణ రన్ కార్యక్రమాన్ని ఎల్లారెడ్డిలోని అంబేద్కర్ స్టాచ్యూ నుంచి ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ వరకు నిర్వహిస్తున్నట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌లు తెలిపారు. ఈ తెలంగాణ రన్ కార్యక్రమానికి ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు జాజాల సురేందర్ ముఖ్య అతిథిగా, నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నారని, కావున నియోజకవర్గంలోని అన్ని మండలాల యువకులు, విద్యార్థులు, అన్ని శాఖల అధికారులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ తెలంగాణ రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తెలంగాణ రన్ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయండి : జుక్కల్ ఎస్సై మురళి

జుక్కల్ : తెలంగాణ రాష్ట్ర శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈ నెల 12న జూన్ 2023 సోమవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే రన్‌ను జుక్కల్ మండల యువకులు, ప్రజలు, మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని జుక్కల్ ఎస్సై మురళి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిచ్కుంద సర్కిల్ పరిధిలోని గ్రామాల వారు పాల్గొనే వారికి ప్రతి ఒక్కరికి టీ షర్ట్‌తో పాటు అల్పాహారం, భోజన సదుపాయం కల్పించనున్నట్టు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి 20 నుంచి 30 మంది పాల్గొని రన్‌ను విజయవంతం చేయాలని సూచించారు.

పోలీస్ రన్‌కు ప్రతి ఒక్కరూ తరలిరావాలి..

మద్నూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుందని అందులో భాగంగా ఈనెల 12న పోలీసు రన్ నిర్వహించనున్నట్టు మద్నూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ రన్ కార్యక్రమం బిచ్కుంద మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి కమ్మరి గుడి వరకు ఈ నెల 12న ఉదయం 6 గంటలకు చేపట్టనున్నట్టు వివరించారు. పోలీస్ రన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే హనుమంతుషిండే పాల్గొంటారని ఎస్ఐ తెలిపారు. పోలీస్ రన్ కార్యక్రమానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఎస్ఐ ప్రజలను కోరారు.

పింఛన్ పెంపుపై వికలాంగుల హర్షం

- సీఎం కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం


బోధన్ : చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న వికలాంగులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/బోధన్

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు తెలంగాణ తల్లి ప్రాంగణంలో ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన వికలాంగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.3016 ఉన్న పెన్షన్‌ను రూ.4016 పెంచిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వికలాంగుల అభివృద్ధికి మరెన్నో సంక్షేమ పథకాలు చేపట్టాలని వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రవీణ్, సతీష్, శ్రీను, ఓట్లెమ్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ చిత్రపటానికి పాలాభిషేకం..

బోధన్ : సాలూర మండల కేంద్రంలో ఆదివారం సాలూర గ్రామానికి చెందిన వికలాంగులు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఎండీ షకీల్ ఆమేర్, ఎమ్మెల్సీ కవిత చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ వికలాగులకు అందిస్తున్న 3000/-ల ఫించన్‌తో పాటు వారి సౌకర్యార్థం మరో 1000/- రూపాయలు అదనంగా పెంచుతూ జీవో జారీ చేసినందుకు ఆయనకు రుణపడి ఉంటామని అన్నారు. అందులో భాగంగా ఆయన చిత్రపటానికి అలాగే ఎమ్మెల్యే షకీల్, ఎమ్మెల్సీ కవిత చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వికలాంగుల పాలిట వెలుగు దివ్యగా మారారని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వికలాంగులు అభిషేక్ గిరి, ఎల్మ శివయ్య, ముట్టెన్ శంకర్, పిల్లల చాందు, సంగెపు గోదావరి, సాలూర నిర్మల, కటికే గంగారాం, ముట్టెన్ గంగాధర్, సింగాడి లక్ష్మణ్, కల్లూర్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డి : చిత్రపటాలకు పాలాభిషేకం..

దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనం వృథా

- ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు బాలు యాదవ్


మాట్లాడుతున్న ఎంఎస్పీ నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనం వృథా అవుతుందని ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు బాలు యాదవ్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు క్రేవార్ బాలు యాదవ్ మాట్లాడుతూ.. ప్రాణ త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ హాయంలో ఏ ఒక్క కుటుంబం బాగుపడలేదని.. కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగు పడిందని ఆరోపించారు. దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని విమర్శించారు. అధికార బీఆర్ఎస్ పార్టీ జుక్కల్ నియోజకవర్గం ఎమ్మెల్యే అయిన హన్మంత్ షిండే ఇక్కడ స్థానికంగా ప్రజల సమస్యలు ఒక్కటి కూడా పట్టించుకోకుండా ఎమ్మెల్యే మాత్రం ధనవంతుడు అయ్యాడని అన్నారు. భూములు సంపాదించుకున్నాడని ఆరోపించారు. పేద ప్రజల సమస్యలు మాత్రం ఏమాత్రం పట్టించుకోని ఈ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరిట సంక్షేమం పేరుతో పార్టీ ప్రచారాలు జరుపుకుంటుందని ప్రభుత్వ పరంగా నిర్వహించే దశాబ్ద ఉత్సవాల్లో పార్టీ నాయకులు గానీ, ఎమ్మెల్యే గానీ రాబోయే ఎన్నికల్లో మరొక్కసారి కేసీఆర్‌కు అవకాశం ఇవ్వాలని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రజలకు ఏం చేశారని దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నారని ప్రశ్నించారు. మండలంలో గ్రామ పంచాయతీ ముందర రహదారి చూస్తే ఆ రోడ్డు సరిగ్గా లేక ప్రజలు, ప్రయాణికులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని, అభివృద్ధి మాత్రం శూన్యమన్నారు. దశాబ్ది ఉత్సవాలు మాత్రం ఘనం అనే చందంగా అధికార పార్టీ ప్రజాధనాన్ని వృథా చేస్తుందని దశాబ్ది ఉత్సవాల్లో ప్రజలకు ఏమిస్తుందని ప్రశ్నించారు. జుక్కల్ నియోజకవర్గంలో వేల సంఖ్యలో అర్హులైన నిరుపేదలు ఇండ్లు లేక, ఇండ్ల స్థలాలు లేక కొట్టుమిట్టాడుతుంటే ఏ ఒక్కరికి ఇండ్లు మంజూరు చేయడం లేదని, కానీ దశాబ్ది ఉత్సవాల్లో ఎన్నికల ప్రచారాలు జరుపుకోవడం సిగ్గుచేటని ఆరోపించారు. దళితులకు దళిత బంధు లేదు, మూడెకరాల భూమి లేదు కానీ.. మళ్లీ కొత్త సాకుతో బీసీ కులాలకు లక్ష రూపాయలు ఆర్థిక సాయం అంటూ ఎక్కడో ఒకరిద్దరికీ పంపిణీ చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న పనితీరును ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో ప్రజలే ఆ పార్టీకి బుద్ధి చెప్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు క్రేవార్ మరోతి, మరోతి కొలవార్, పాండు మాదిగ క్రేవార్, పాండురంగ మాదిగ, ద్యపుర్వర్ సురేష్, గడ్డంవార్, అర్జున్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ దేవతల ఉత్సవాలు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని సజ్జనపల్లి గ్రామంలో సోమవారం నుంచి రెండు రోజులపాటు గ్రామ దేవతల ఉత్సవాలు నిర్వహించనున్నట్టు సర్పంచ్ పుట్టి పోచయ్య తెలిపారు. ఆదివారం సర్పంచ్, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు గ్రామపెద్దల సమక్షంలో గ్రామ దేవతల పండుగపై ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సోమవారం గ్రామదేవతలైన నల్ల పోచమ్మ, ముత్యాల పోచమ్మ, పోలేరమ్మతో పాటు తదితర గ్రామదేవతలకు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం బోనాలు తీయనున్నట్టు తెలిపారు. అదేవిధంగా మంగళవారం ముదిరాజుల ఆరాధ్యమైన పెద్దమ్మకు ముదిరాజ్ కులస్తులు ఇంటింటికి బోనాలు తీయనున్నట్టు వివరించారు. అదే రోజు సాయంత్రం కుస్తీ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కుస్తీ పోటీల్లో టెంకాయ కుస్తీ నుంచి మొదలుకొని మూడు కులాల వెండి కడియం వరకు విజేతలకు అందజేయనున్నట్టు వివరించారు. సమావేశంలో ఉప సర్పంచ్ రవీందర్‌గౌడ్, గ్రామపెద్దలు మూగూరి లక్ష్మయ్య, మాసాన్నగారి రాములు, మంత్రి పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్లలో ఘనంగా భీమన్న పండగ



నవతెలంగాణ-ఏర్గట్ల
మండలకేంద్రంలోగల సర్కార్ భీమన్న పండగ ఆదివారం పెద్దరేండ్ల, చిన్న రేండ్ల సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు రాజారాం మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం మిరుగు సందర్భంగా పంటలు సంవృద్ధిగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని భీమన్న స్వామికి గంగనీటితో అభిషేకం చేసి పూజలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో నేడు 2కె రన్

నవతెలంగాణ-ముప్కాల్
తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం రోజు ఉదయం ఆర్మూర్ సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో భీంగల్‌లో నిర్వహిస్తున్న 2కె రన్ విజయవంతం చేయాలని ముప్కాల్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ భాస్కరా చారి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని యువకులు, యువజన సంఘాల నాయకులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగస్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. 2కె రన్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిప్నారు. భీంగల్ పట్టణ కేంద్రంలోని కషి స్కూల్ నుంచి బస్టాండ్ వరకు ఉదయం 6 గంటలకు 2కె రన్ ప్రారంభం కానుందని, యువకులు ముందుగానే చేరుకోవాలని పేర్కొన్నారు.

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి

- భూసార పరీక్షలు చేసుకోవాలి
- మండల వ్యవసాయాధికారి



నవతెలంగాణ-ఏర్గట్ల
నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవడం వల్లనే రైతులు అధిక దిగుబడులు పొందుతారని ఏర్గట్ల మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ రైతులకు సూచించారు. భూసార పరీక్షలు చేసి పంటలు వేయాలని అన్నారు. వేసవిలో దుక్కులు చేసుకోవడంవల్ల భూమి నాణ్యత పెరుగుతుందన్నారు. పంటల సంరక్షణ, అధిక దిగుబడుల కోసం వివిధ సలహాలు సూచనలు అందించారు.

భూసార పరీక్షలు

పంట కోతల అనంతరం రైతులు తమ పొలంలోని మట్టిని ప్రతీ రెండు లేక మూడు సంవత్సరాలకోసారి పరీక్ష చేయడంవల్ల భూమిలోని పోషకాల యొక్క హెచ్చుతగ్గులు తెలుస్తాయి. మట్టి నమూనాలను సమీపంలో ఉన్న భూసార పరీక్ష కేంద్రానికి పంపితే భూమి నాణ్యత తెలుస్తుంది.

భూమి నాణ్యత, సారం పెంచుకోవడానికి..

భూమి నాణ్యత పెంచుకోవడానికి రైతులు పంట కోసిన తర్వాత పొలంలో మిగిలిపోయిన అవశేషాలను కాల్చకుండా రోటవేటర్ సహాయంతో భూమిలో కలియదున్నాలి. ఇదే కాక పంటవేయాడానికి ముందు పచ్చిరొట్టె పంటలైన జనుము, జీలుగ వేసుకొని వరి నాట్లు వేసుకునే సమయానికి నేలలో కలియదున్నితే మంచి ఫలితాలు రాబట్టవచ్చు.

విత్తన ప్రాముఖ్యత

పంటల దిగుబడి, చీడపీడలను తట్టుకునే స్వభావం, మొలక శాతం, మొక్క ఇతర లక్షణాలన్నీ నిగూఢంగా ఒక విత్తనంలో దాగి ఉంటాయి. కావున వ్యవసాయంలో మంచి దిగుబడి పొందాలంటే వీటన్నింటినీ బేరీజు వేసుకోవాలి.

నాసిరకం విత్తనాలు గుర్తించడం ఎలా

విత్తన చట్టంలో ఉండే ప్రమాణాలకు అనుగుణంగా విత్తనోత్పత్తి చేయకుండా, మార్కెట్‌లో సాధారణ రైతులు పండించిన ధాన్యాన్ని తెచ్చి ఎలాంటి లేబిలింగ్ లేకుండా లూజ్‌గా అమ్మే విత్తనాలు నాసిరకం విత్తనాలుగా గుర్తించవచ్చు. ఒక వేళ ప్యాకెట్ లలో ఉన్నా అది ప్రామాణికమైన విత్తన ట్యాగ్ కలిగి ఉండదు.

5.ఎలాంటి విత్తనాలు కొనుగోలు చేయాలి..జాగ్రత్తలేవి?

విత్తన సంచికి ధ్రువీకరణ ట్యాగ్ జత పరచబడి, ధ్రువీకరణ అథారిటీ సీలు కలిగివున్న సంచులనే కొనాలి. ట్యాగ్‌పై విత్తన పరీక్ష తేదీ, కాలపరిమితి గడువు చూసుకోవాలి. ధ్రువీకరణ ట్యాగ్‌పైన విత్తన ధ్రువీకరణ అధికారి సంతకం కలిగి ఉండాలి. ట్యాగ్ పైన, సంచిపైన పంట రకం, లాట్ నంబర్ సరి చూసుకోవాలి.

.వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు

పంటలు వేయడానికి ముందు తమ పంట పొలాల్లో కోతల అనంతరం. "వేసవి లోతు దుక్కులు"చేసుకోవాలి. వీటి వలన భూమిలోని గట్టి పొరను చేధించడంతో పాటు, తుంగ గరిక వంటి మొండి జాతి కలుపు మొక్కలు, భూమి లోపల కోశస్థ దశలో ఉన్న పురుగులు పైకి వచ్చి ఎండ వేడికి చనిపోతాయి. తద్వారా భూమి నాణ్యత పెరుగుతుంది.

ఎలాంటి వాతావరణంలో పంటలు వేయవచ్చు

తేలికపాటి నేలల్లో 50 నుండి 60 మిల్లి మీటర్లు, బరువు నేలల్లో 60 నుండి 75 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయిన తర్వాత లేదా నేలలో 15 నుండి 20 సెంటి మీటర్ల లోతు తడిసిన తర్వాతనే రైతులు వర్షాధార పంటలైన జొన్న, సోయా చిక్కుడు, కంది, పెసర, పత్తి మొదలగునవి వేసుకోవాలి.

• నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలి
మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ వాయిస్



వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా, నాణ్యమైన విత్తనాలు ఎంచుకుని, రైతులు పంటలను విత్తుకోవాలి. విత్తన నాణ్యతను పరీక్షించుకున్న తర్వాతనే పంటలు వేయాలి. పంట దశలో చీడపీడలను కనిపెట్టి, తగిన మోతాదులో ఎరువులను వాడి అధిక దిగుబడులు పొందాలి. రైతులకు సలహాలు,సూచనలు కావాలంటే అందుబాటులో ఉన్న వ్యవసాయాధికారిని అడిగి తెలుసుకుని సందేహాలు నివృత్తి చేసుకోవాలి.

పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బిగాల

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాలగణేష్‌గుప్త అర్సపల్లిలో ఆధునిక సదుపాయాలతో నిర్మిస్తున్న వైకుంఠ ధామాన్ని ఆదివారం పరిశీలించారు. ఇది వరకే 15వ డివిజన్ అర్సపల్లిని దత్తత తీసుకున్న ఎమ్మెల్యే ప్రత్యేక నిధులతో సామాజిక భవనాలు, రోడ్లు, డ్రైనేజిలను నిర్మించారు. మంచి నీటి ట్యాంకులు, ఫీడర్ లైన్లు వేసి ప్రతి ఇంటికి సురక్షిత నీరు అందిస్తున్నారు. చివరి మజిలీకి ఘనంగా వీడ్కోలు పలికేందుకు ప్రత్యేక డిజైన్‌లతో వైకుంఠ ధామాన్ని నిర్మిస్తున్నారు. శ్మశాన వాటిక అనే అనుభూతి కలగకుండా పచ్చని చెట్లతో అందమైన లైట్లతో హైదరాబాద్ తరహా సదుపాయాలతో నిర్మిస్తుండటంతో ఆ ప్రాంత ప్రజలు ఆశర్యం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వర్యులు కేటీఆర్ వైకుంఠ ధామాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

నేడు చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఆర్మూర్
నేటి దీక్ష దివాస్,. చలో కలెక్టరెట్‌ను జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ ప్రజాపందా నాయకులు దేవారం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత కలెక్టరెట్ వర్ధ ధర్నా చౌక్‌లో సభ నిర్వహించబడునని పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఉద్యోగ ఖాళీలన్ని భర్తీ చేయాలని, కాంట్రాక్టు. ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, రైతుల రుణాలను మాఫీ చేయాలని తెలిపారు. పోడు భూములన్నింటికీ పట్టాలు ఇవ్వాలని, గిరిజనేతర పేదలకు సాగు హక్కులు కల్పించాలని, రేషన్ కార్డులు. పెన్షన్లు. ఇండ్ల స్థలాలు అర్హులందరికి ఇవ్వాలని, అర్హులందరికి డబుల్ బెడ్ రూం ఇళ్లను ఇవ్వాలని పేర్కొన్నారు. ఇంటి స్థలాలు ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి 10లక్షలు ఇవ్వాలని, ధరణి వెబ్‌సైట్ అవకతవకలను వెంటనే సరిచేయాలని, ఉపా చట్టం రద్దు చేయాలని, ప్రాజెక్టులకు పంట కాలువలు తీయాలని తెలిపారు. దళితులకు 3ఎకరాల భూమి ఇవ్వాలని, నిరుద్యోగులందరికి 10వేల రూపాయల నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నేడు జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు..

జిల్లా మహాసభ విజయవంతం చేయండి : పీవైఎల్



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
ఈనెల 25 న నగరంలోని కోటగల్లి ఎన్ఆర్ భవన్లో నిర్వహించనున్న ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్) నిజామాబాద్ జిల్లా ఎనిమిదవ మహాసభలు విజయవంతం చేయాలని పీవైఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రవి, వనమాల సత్యం కోరారు. ఆదివారం నగరంలోని కోటగల్లీ నీలం రామచంద్రయ్య భవన్ లో పివైఎల్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించిన అనంతరం రాష్ట్ర అధ్యక్షులు దేశెట్టి సాయి రెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని, స్వాతంత్ర సమరయోధులు అల్లూరి సీతారామరాజు, చంద్రశేఖర్ ఆజాద్, భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవల స్ఫూర్తితో యువత ఉపాధి అవకాశాల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ యువతకు ఉద్యోగాల కల్పన విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన అన్నారు. యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న మోడీ, కేసీఆర్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. కెసిఆర్ ఎనిమిదేళ్ల పాలనలో నియామకాల మాట నత్త నడకలా ఉందని ఆయన అన్నారు. ఉద్యమాన్ని తీవ్రం చేసేందకు పీవైఎల్ రాష్ట్ర ఎనిమిదవ మహాసభలను జూలై 4,5న ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత పెద్ద ఎత్తున పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పివైఎల్ జిల్లా నాయకులు జి.శ్రీనివాస్, సాయినాథ్, బండమీది నరసయ్య, సాగర్, గంగాధర్, కత్తుల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

గోవింద్‌పేట్‌లో కట్ట మైసమ్మ పండుగ సంబరాలు



పండుగలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఆర్మూర్
మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలో ఆదివారం వీడిసి ఆధ్వర్యంలో కట్టమైసమ్మ పండగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బండమీది గంగాధర్, ఎంపీటీసీ రాజ్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ బంటు మహిపాల్, వీడిసి అధ్యక్షులు లింగరెడ్డి, బందమిది సుభాష్, సాయిరెడ్డి, లింబాద్రి, చైర్మెన్ మహిపాల్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల్లో 'చిన్నారి కథలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన అధికారులు

నవతెలంగాణ-ఏర్గట్ల
తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాహిత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో తడపాకల్ గ్రామానికి చెందిన విద్యార్థిని డేగల వైష్ణవి రాసిన "చిన్నారి కథలు"పుస్తకావిష్కరణ కార్యక్రమం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు,జడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్,మేయర్ నీతూ కిరణ్ చేతుల మీదుగా జరిగినట్లు తడపాకల్ తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ తెలిపారు. కవి సమ్మేళనంలో భాగంగా కవుల మధ్య ఈ పుస్తకావిష్కరణ జరగడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. చిన్న వయసులోనే పుస్తకాన్ని రచించిన డేగల వైష్ణవిని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అభినందించి శాలువా, మెమోంటో, నగదు బహుమతితో సత్కరించారన్నారు. కార్యక్రమంలో విపి.చందన రావ్, పంచరెడ్డి లక్ష్మణ్, ఇతర పెద్దలు పాల్గొన్నట్లు తెలిపారు.

మేక్ క్యాంపస్ ప్లాస్టిక్ ఫ్రీ వాల్ పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
ప్రపంచ పర్యావరణ దినోత్సవాలను పురస్కరించుకొని స్టూడెంట్ ఫర్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో "ప్లాస్టిక్ రహిత భారత్"అనే నినాదంతో దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమాల్లో భాగంగా యూనివర్సిటీలో ఆదివారం వాల్పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఎస్ఎఫ్‌డి కన్వీనర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ..పర్యావరణాన్ని పరిరక్షించడం, ప్రజారోగ్యాన్ని పెంపొందించడం, స్థిరమైన భవిష్యత్తును సృష్టించడంకోసం ప్లాస్టిక్ రహిత భారత్ నిర్మాణం కీలకమైనదని ఆయన అన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడం అనేది వినియోగదారుల ప్రవర్తనను మార్చడం, వ్యర్థ పదార్థాల నిర్వహణ, మౌలిక సదుపాయాలు సరిపోకపోవడం వంటి సవాళ్లతో వస్తుందని వివరించారు. ప్రజా అవగాహన ప్రచారాలు, ప్రభుత్వ నిబంధనలు, స్థిరమైన ప్రత్యామ్నాయాలు, రీసైక్లింగ్ కార్యక్రమాలు, కార్పొరేట్ బాధ్యతతో సహా సమిష్టి కృషి అవసరం ఉందని ఆయన తెలిపారు. కలిసి పని చేయడం ద్వారా, మనం రాబోయే తరాలకు పరిశుభ్రమైన, సురక్షితమైన మరింత స్థిరమైన భారత్‌ను సృష్టించగలమని, అందుకు మనమందరం కలిసి పని చేయాల్సిన అవసరం ఎంతగానో ఉందని అన్నారు. కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ బచ్చనబోయిన శివ, ఇందూర్ జిల్లా ఎస్ఎఫ్‌డి కన్వీనర్ ప్రమోద్, తెలంగాణ యూనివర్సిటీ ఎస్ఎఫ్‌డి టీంసభ్యులు కార్తిక్, రాజు, మహేష్, జయంత్, శ్రావణ, ముఖేష్, సునీల పాల్గొన్నారు.

యెనుగందుల శంకర్‌కు సత్కారం



సత్కారం అందుకున్న యెనుగందుల శంకర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి
తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఇందల్ వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య విస్తరణ అధికారిగా పనిచేస్తున్న యెనుగందుల శంకర్ కవితా శీర్షిక "ఉద్యమ తెలంగాణ ఉజ్వల తెలంగాణ' గానం చేసినందుకుగాను జిల్లా అదనపు కలెక్టర్ చిత్రమిశ్రా, జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విటల్ రావు, నగర మేయర్ నీతూ కిరణ్‌ల చేతుల మీదుగా శాలువతో సన్మానం, ప్రశంసా పత్రం, మెమోంటోఅందించి సత్కరించారు. 1,116/- నగదు బహుమతి అందుకున్నారు. యెనుగందుల శంకర్ కు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుదర్శనం, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారం రాథోడ్, ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సంతోష్ కుమార్, జిల్లాఉపవైద్యఆరోగ్య శాఖాధికారి సరిత అభినందనలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి
నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో సీఎం సహాయనిధి కింద మంజూరైన చెక్కులను బాధితులకు ఆదివారం ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ ఆపద సమయాల్లో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి ద్వారా సీఎం కేసీఆర్ ఆదుకుంటున్నారని అన్నారు. మండలంలోని కొరట్‌పల్లి గ్రామానికి చెందిన యం. నడిపి గంగారంకు లక్షరూపాయల చెక్కును, యం.హనుమంతు రూ. లక్షా 25వేల చెక్కును పంపిణీ అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నవీన్ రెడ్డి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

గోసంగిలు మరింత ఎదగాలి

- అడ్లూరి శ్రీనివాస్
- గొసంగి యువజన సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న శ్రీనివాస్

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ పట్టణంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు లో గల గొసంగి కుల సంఘ భవనంలో గొసంగి యువజన సదస్సు ఆదివారం ఏర్పాటుచేశారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ న్యాయవాది, సామాజిక ఉద్యమకారులు అడ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇప్పుడిప్పుడే అన్ని రంగాల్లో గొసంగిలు ఎదుగుతున్నారని, రాబోయే రోజుల్లో గొసంగిలు మరింత ఎదగాలని అన్నారు. రాజకీయాల్లో గొసంగి యువత పాత్ర పెరగాలని అన్నారు. అనంతరం గోసంగి యువజన సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఈర్నాల వినోద్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఈర్నల గంగా రాజేశ్వర్, రేవల్లి సాయిలు, ప్రధానకార్యదర్శి పత్రీ సాయికుమార్, కోశాధికారిగా విభూది అనిల్. కార్యనిర్వహణ కార్యదర్శిగా గంధం సత్య. సహాయ కార్యదర్శులుగా గంధం భాస్కర్, రాసుల రాజు, ఈర్నాల పెంటన్న, కళ్లెం కిషన్. ప్రచార కార్యదర్శిగా కళ్లెం ఒడ్డెన్న. సంయుక్త కార్యదర్శులుగా ఈర్నాల శ్రీకాంత్, కర్రే శేఖర్, కొండపల్లి గంగాశంకర్, ఎక్సుక్యూటివ్ మెంబెర్లుగా పత్రీ రమేష్, ఈర్నాల సాయికుమార్, డొక్క నరేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గోసంగి జిల్లా అధ్యక్షులు గంధం రాజేష్, ఎస్సి ఉప కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు నిరగొంఢ బుచ్చన్న, ఈర్నాల లక్ష్మణ్, గంధం బుద్ది రాజు, పెద్ద సంఖ్యలో గొసంగి యువత పాల్గొన్నారు

మామిడిపల్లిలో గ్రామదేవతలకు గంగాజలాలతో అభిషేకం



జలాభిషేకంలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఆర్మూర్
మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ దేవతలకు గంగాజలాలతో అభిషేకాలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సంగీత రవి గౌడ్, కవిత కాశీరాం, ఆకుల రాము వీడిసి సభ్యులు ప్రవీణ్ గౌడ్, నరేష్, సుధా సీడ్స్ నితిన్, మోహన్, రాజన్న, వడ్ల విశాల్, మనీష్ చారి, ప్రణీత్, బబ్లు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ కులాన్ని చిన్నచూపు చూడడం సరికాదు



నవతెలంగాణ-మోర్తాడ్
తెలంగాణ ప్రభుత్వం లక్ష రూపాయల ఆర్థిక సహాయ జాబితాలో ముదిరాజు కులాన్ని పొందుపరచకపోవడం పట్ల ఆ కులాన్ని చిన్న చూపు చూడడమే అవుతుందని బాల్కొండ నియోజకవర్గ అధ్యక్షులు జక్కం అశోక్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ శతాబ్ది వేడుకల్లో భాగంగా కులవృత్తుల కులాలకు లక్ష రూపాయల ఆర్థిక సాయం అంటూ ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్ కులాన్ని అందులో పొందుపరచకపోవడం పట్ల ప్రభుత్వ వైఖరిని ఆయన వ్యతిరేకించారు. ముదిరాజ్ కులం బిసి కులాల్లో లేదా అని ఆయన అన్నారు. కుల వృత్తుల వారందరికీ లక్ష రూపాయల ఆర్థిక సాయంతో ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్ కులస్తుల పేరును అందులో పొందుపరచకపోవడం సరికాదని, తక్షణమే ప్రభుత్వం ముదిరాజ్ కులం బిసి సంక్షేమ శాఖలోనే ఉందని, వారిని కూడా లక్ష రూపాయలు ఆర్థిక సాయం జాబితాలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జనాభా ప్రతిపాదికన అధిక ఓటింగ్ శాతాన్ని కలిగి ఉన్న ముదిరాజ్ కులస్తులకు ప్రభుత్వ అందించే కులవృత్తుల లక్ష రూపాయల రుణ జాబితాలో పేరు లేకపోవడం ముదిరాజులను అవమానపరిచినట్టేనని అన్నారు. తక్షణమే రాష్ట్రప్రభుత్వం ముదిరాజులకు సైతం లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందేలా ప్రభుత్వం జాబితాలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు మామిడిపల్లి చౌరస్తా నుంచి 2 కే రన్

నవతెలంగాణ-ఆర్మూర్
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం మామిడిపల్లి చౌరస్తా నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు తెలంగాణ 2కే రన్ నిర్వహించడం జరుగుతుందని స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు ఆదివారం తెలిపారు. ఈ రన్‌ను ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని, ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు, యువత, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

ఐదో వారం స్వచ్ఛ కాలనీ

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో ఆదివారం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛ కాలనీ, సమైక్య కాలనీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఆదివారం తలపెట్టిన కార్యక్రమంలో భాగంగా అయిదో వారం కాలనీ వాసులు రెండు గంటల పాటు శ్రమదానం చేశారు. కాలనీ వాసులు చీపుర్లు పట్టుకొని అయిదో నెంబర్ రోడ్‌ను ఊడ్చారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురుగు కాలువలు శుభ్రం చేశారు, పిచ్చి మొక్కలను, పొదలను తొలగించారు, ముళ్ళ చెట్లను కొట్టేశారు, పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు, జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి బి. కమలాకర్, ఉపాధ్యక్షులు కొక్కెర భూమన్న, సుంకే శ్రీనివాస్, కార్యదర్శులు సాయన్న, రాజ్ కుమార్, కాలనీ పెద్దలు ఎల్. టి. కుమార్, దమ్మన్న స్వామి, జీవన్, రవి, ఖదీర్, భాజన్న తదితరులు పాల్గొన్నారు.